
సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

సోమవారం । 9 । జనవరి । 2023



డెల్టాలకు 9,170 క్యూసెక్కులు

రాజమహేంద్రవరం రూరల్: ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ నుంచి గోదావరి డెల్టా కాలువలకు ఆదివారం 9,170 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,650, మధ్య డెల్టాకు 1,920, పశ్చిమ డెల్టాకు 4,600 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజ్ వద్ద నీటిమట్టం 7.85 అడుగులకు చేరింది.



రూ.1,00,116 విరాళం

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి అమలాపురం వాస్తవ్యులు దొమ్మేటి సత్యశ్రీనుమురళి, చంద్రశారద దంపతులు ఆదివారం రూ.1,00,116లు విరాళం అందజేశారు. వారికి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

కాకినాడ ఐటీఐలో నేడు అప్రెంటిస్ మేళా

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఐటీఐ ఉత్తీర్ణులైన విద్యార్థులకు కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో సోమవారం ప్రధానమంత్రి అప్రెంటిస్ మేళా నిర్వహిస్తున్నట్లు జూనియర్ అప్రెంటిస్ అడ్వైజర్ ఎంఎస్ఎస్ మూర్తి ఆదివారం తెలిపారు. కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పు గోదావరి జిల్లాల్లో ఐటీఐ ఉత్తీర్ణులై, ఎన్‌టీసీ సర్టిఫికెట్ కలిగిన అభ్యర్థులు దీనికి హాజరు కావచ్చన్నారు. ప్రముఖ పరిశ్రమల ప్రతినిధులు వచ్చి అభ్యర్థులకు ఎంపిక చేసుకుంటారని తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఉదయం 9 గంటలకు తమ విద్యార్హతల సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

న్యూస్‌రీల్

అంతర్వేదిలో ప్రభుత్వ నేషనల్ మీడియా సలహాదారు అమర్



అమర్‌కు స్వామి చిత్రపటం అందజేస్తున్న ఏసీ సత్యనారాయణ

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జాతీయ మీడియా సలహాదారులు దేవులపల్లి అమర్ కుటుంబ సమేతంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, వేదపండితుడు చింతా వేంకటశాస్త్రి, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం అర్చకులు అమర్, కుటుంబ సభ్యులకు ఆశీర్వచనాలు పలికారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదాన్ని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ అందజేశారు. సూపరింటెండెంట్ పి.విజయ సారథి పాల్గొన్నారు.

వీరేశ్వర అన్నదాన ట్రస్టుకు రూ.11,116 విరాళం



ఆలయ అర్చకుడు సుబ్బారావుకు విరాళం అందజేస్తున్న దాతలు

ఐ.పోలవరం: మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామివారి నిత్యాన్నదాన ట్రస్టుకు యానాంకు చెందిన చెక్కా నాగేశ్వరరావు రూ.11,116 విరాళంగా అందించారు. ఆదివారం ఆలయ అర్చకుడు యనమండ్ర సుబ్బారావుకు ఈ మొత్తాన్ని అందించారు. దాతకు ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ స్వామివారి చిత్ర పటం అందజేశారు.

ఫొటోగ్రాఫర్ శ్రీనివాస్‌కు బంగారు పతకం



శేఖర్, వెంకటేశ్వర్లు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న శ్రీనివాస్

సఖినేటిపల్లి: మండల పరిధిలోని టేకిశెట్టిపాలెంలో రాజా స్టూడియో నిర్వహిస్తున్న అప్పనరామునిలంకకు చెందిన ఫొటోగ్రాఫర్ నల్లి శ్రీనివాస్ తీసిన ఫొటోకు అంతర్జాతీయ వర్క్‌షాపు పోటీల్లో బంగారు పతకం వచ్చింది. రాజమహేంద్రవరంలోని రైల్వే వంతెనను వేకువ జామున ఫొటో తీయగా పై పతకం దక్కింది. ఈ నెల 5, 6 తేదీల్లో పాపికొండలులో వర్క్‌షాపు జరిగినట్టు, తన చిత్రం ఇందులో అర్హత సాధించినట్టు ఆయన ఆదివారం తెలిపారు. సిగ్మా అకాడమీ అధ్యక్షుడు ఎంసి శేఖర్, ఏపీ ఫొటోగ్రఫీ అకాడమీ అధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు చేతుల మీదుగా అవార్డు అందుకున్నానన్నారు. రాజోలు తాలూకా ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ అసోసియేషన్ ప్రతినిధులు మీనన్, స్టాలిన్, సీవీ రావు, సతీష్, ప్యాషన్ శ్రీనుబాబు, రవితేజ, భానురాజా అభినందించారు.



బంగారు పతకానికి ఎంపికైన రైల్వే వంతెన చిత్రం

జూనియర్ అసిస్టెంటుగా..

అమలాపురానికి చెందిన ఈమని రామసూర్యారావు ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లి పంచాయతీ కార్యదర్శిగా పని చేసేవారు. గత ఏడాది ఏప్రిల్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన మృతి చెందారు. ఆయన కుమారుడు అజయ్‌కు ఐదు నెలల్లోనే అంటే.. సెప్టెంబర్ 16న అమలాపురం డీఎల్‌పీఓ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా ప్రభుత్వం కారుణ్య నియామకం కల్పించింది. అప్పటి డీఎల్‌పీఓ, ప్రస్తుత కాకినాడ జిల్లా పంచాయతీ అధికారి ఆర్.విక్టర్ నియామక ఉత్తర్వులు అందజేశారు.

డీపీఓ విక్టర్ నుంచి నియామక ఉత్తర్వులు అందుకున్న అజయ్



తండ్రి మరణించిన నెలల వ్యవధిలోనే..



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ముమ్మిడివరపు శివాజీ గణేష్ సూపర్‌వైజర్‌గా పని చేసేవారు. ఆయన గత ఏడాది ఆగస్టు 21న అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుమారుడు కుమారస్వామి ఇంటర్మీడియెట్ చదువుకున్నాడు. గణేష్ సహచర ఉద్యోగుల సహకారంతో కుమారస్వామి కారుణ్య నియామకం కోసం కాకినాడ కలెక్టరేట్‌లో సెప్టెంబర్ నెలలో దరఖాస్తు చేసుకున్నాడు. దానిని పరిశీలించి, క్షేత్ర స్థాయి నివేదిక రప్పించుకున్న జిల్లా యంత్రాంగం.. కుమారస్వామికి నెలలు తిరగకుండానే కొత్తపేట మండలం పలివెల గ్రామ పంచాయతీ కార్యాలయంలో బిల్లు కలెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చింది.

కష్టాల వేళ.. కారుణ్యధార

- చకచకా కారుణ్య నియామకాలు
- దరఖాస్తు చేసుకున్న నెలల వ్యవధిలోనే ఉద్యోగం
- ఉమ్మడి జిల్లాలో మూడున్నరేళ్లలో 380 కుటుంబాలకు ఆసరా

ఆసరాగా ఉన్న ఇంటి పెద్ద హఠాత్తుగా చనిపోతే ఆ కుటుంబం చిన్నాభిన్నమవుతుంది. చిన్నదో, పెద్దదో ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న కుటుంబ యజమాని చనిపోతే వారిపై ఆధారపడిన మిగిలిన వారి పరిస్థితి ఏమిటి? అటువంటి కుటుంబాల పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 'కారుణ్య'ధారలు కురిపిస్తోంది. నిండు మనసుతో భరోసా ఇస్తోంది.

సాక్షి ప్రతినిధి, కాకినాడ: అనుకోని పరిస్థితుల్లో ప్రభుత్వోద్యోగి చనిపోతే ఆ కుటుంబంలో భార్య/భర్త లేదా పిల్లలకు ప్రభుత్వం కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు ఇస్తుంది. వాస్తవానికి వారసులకు ఉద్యోగం ఇవ్వడమనే విధానం ఎప్పటి నుంచో అమలులో ఉంది. తండ్రి ఉద్యోగం భార్య లేదా పిల్లలకు ఇవ్వాలనేది ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసు రూల్స్‌లోనే ఉంటుంది. అయినప్పటికీ దీనిని గత ప్రభుత్వం పట్టించుకోనే లేదు. పైగా చనిపోయిన వ్యక్తి సహచర ఉద్యోగే అయినప్పటికీ ఏమాత్రం మానవత్వం చూపకుండా కారుణ్య నియామకాలకు దరఖాస్తు చేసుకున్న వారి నుంచి పైసలు ఏరుకునే దుస్థితి కనిపించేది. తండ్రి పని చేసిన కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా నాటి ప్రభుత్వాధికారులు చలించేవారు కాదు. కారుణ్య నియామకానికి దరఖాస్తు చేసిన వారికి ఉద్యోగం ఇవ్వడానికి చుక్కలు చూపించేవారు.

అయితే ఇదంతా గతం

నేడు ఆ పరిస్థితి పూర్తిగా మారింది. మనసున్న, మానవతా విలువలున్న ప్రభుత్వం రాష్ట్రంలో పాలన సాగిస్తోంది. ఫలితంగా మునుపెన్నడూ లేని విధంగా కారుణ్య నియామకాలు జరుగుతున్నాయి. దరఖాస్తు చేసిన తేదీ నుంచి రెండు మూడు నెలలు.. ప్రత్యేక పరిస్థితులుంటే నాలుగైదు నెలలు తిరగకుండానే మృతి చెందిన ప్రభుత్వోద్యోగి కుటుంబ సభ్యులు కారుణ్య నియామకాలు అందుకుంటున్నారు. ఇలా జరగడానికి ఆ కుటుంబంలోని మరొకరు మరో ప్రభుత్వోద్యోగం చేస్తూ ఉండకూడదు. కారుణ్య నియామకానికి దరఖాస్తు చేసుకున్న వ్యక్తే ఆ కుటుంబానికి ఆధారమై ఉండాలి. ఏ ఇతర ఆదాయం పొందుతూ ఉండకూడదు. దరఖాస్తు చేసుకున్న వారసుడు డిగ్రీ చదువుకుని ఉంటే జూనియర్ అసిస్టెంట్, పదో తరగతి, ఇంటర్మీడియెట్ చదువుకుంటే నాలుగో తరగతి ఉద్యోగులుగా కారుణ్య నియామకాలు కల్పిస్తున్నారు. ఉద్యోగం చేస్తూ కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న వ్యక్తి చనిపోతే.. వారి వారసులకు వీలైనంత త్వరగా తిరిగి కారుణ్య నియామకాలు కల్పించడంపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మనసున్న పాలన అంటే ఇది కదా అని అంటున్నారు. జిల్లాల పునర్విభజన అనంతరం ఉమ్మడి తూర్పు గోదావరి.. కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలుగా ఏర్పడింది. ఈ మూడు జిల్లాల్లో కారుణ్య నియామకాలు చేపట్టే నోడల్ కలెక్టర్ బాధ్యతను మాత్రం కాకినాడ కలెక్టర్ కృతికా శుక్లాకే అప్పగించారు.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా గడచిన మూడున్నరేళ్లలో జరిగిన కారుణ్య నియామకాలు

కేటగిరీ	2019 మే నాటికి పెండింగ్	క్యాడర్	2019	2020	2021	2022	మొత్తం
ఎస్సీ, ఎస్టీ యాక్ట్–1989	28	జూనియర్ అసిస్టెంట్	9	5	1	1	16
		ఆఫీస్ సబార్డినేట్/ఎల్‌జీఎస్	11	4	1	–	16
		గ్రామ/వార్డు సచివాలయాలు	–	–	–	–	0
లైన్ డిపార్ట్‌మెంట్ యాజ్ నోడల్ ఆఫీసర్	34	జూనియర్ అసిస్టెంట్	63	58	59	58	238
		ఆఫీస్ సబార్డినేట్/ఎల్‌జీఎస్	7	6	4	5	22
		గ్రామ/వార్డు సచివాలయాలు	8	9	5	8	30
ఏపీఎస్ ఆర్టీసీ	136	గ్రామ/వార్డు సచివాలయాలు	–	–	–	58	58
		మొత్తం	98	82	70	130	380



కారుణ్య నియామకపత్రం అందజేస్తున్న నోడల్ కలెక్టర్ కృతికాశుక్లా, మాజీ మంత్రి, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కన్నబాబు(ఫైల్)

నియామకాలు జరుగుతున్నాయిలా..

- దేశంలోనే తొలిసారిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వినూత్న ఆలోచనతో తీసుకువచ్చిన గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగాల భర్తీలో సైతం కారుణ్య నియామకాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు.
- ప్రభుత్వ రంగంలో విలీనం చేసిన ఏపీఎస్ ఆర్టీసీలో సైతం ఇదే విధానం అమలు చేస్తున్నారు.
- గత ప్రభుత్వ హయాంలో రాజమహేంద్రవరం ఆర్టీసీ రీజియన్‌లోని ఎనిమిది డిపోల పరిధిలో 136 మంది కారుణ్య నియామకాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వాటిని అప్పట్లో పెండింగ్‌లో పడేశారు. వారిని రెండేళ్ల పాటు తిప్పితిప్పి.. ఎటువంటి ఉద్యోగాలూ ఇవ్వకుండా గాలికి వదిలేశారు. ఈ పరిస్థితుల్లో వారిలో 58 మందికి ఈ ఒక్క ఏడాదిలోనే గ్రామ సచివాలయ వ్యవస్థలో కారుణ్య నియామకాలు కల్పించడం విశేషం.
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నుంచి ఏటా రికార్డు స్థాయిలో 80 నుంచి 90 మందిని కారుణ్య నియామకాల కింద వివిధ ఉద్యోగాల్లో నియమించారు.
- మునుపెన్నడూ లేనివిధంగా ఈ మూడున్నరేళ్లలో రికార్డు స్థాయిలో 380 మందికి కారుణ్య నియామకాలు కల్పించడం గమనార్హం.

సత్వరమే కారుణ్య నియామకాలు



దరఖాస్తు వచ్చిన వెంటనే యుద్ధప్రాతిపదికన అన్ని కోణాల్లోనూ పరిశీలన జరిపి, సాధ్యమైనంత వరకూ నాలుగైదు నెలల్లోనే నియామకాలు జరిగేలా చూస్తున్నాం. నెలల తరబడి దరఖాస్తుదారులను కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా చేస్తున్నాం. ఏ శాఖ నుంచి దరఖాస్తు వచ్చినా వెంటనే క్లియర్ చేస్తున్నాం. అందువల్లనే ఏటా పదుల సంఖ్యలో కారుణ్య నియామకాలు చేపట్టగలుగుతున్నాం. ప్రస్తుతానికి ఈ దరఖాస్తులు పెద్దగా పెండింగ్‌లో లేవు.

– కృతికా శుక్లా, నోడల్ కలెక్టర్, కారుణ్య నియామకాలు, కాకినాడ

ఉనికి కోసమే పవన్, చంద్రబాబుల చీకటి ఒప్పందాలు



కాజులూరులో కార్యకర్తలతో మాట్లాడుతున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

మంత్రి వేణుగోపాలకృష్ణ

కాజులూరు: రాష్ట్ర ప్రయోజనాల కోసం కాకుండా తమ పార్టీల ఉనికిని కాపాడుకునేందుకే చీకటి ఒప్పందాలతో చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ ముందుకు వెళుతున్నారని రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాలకృష్ణ అన్నారు. ఓ కార్యక్రమంలో పాల్గొనడానికి కాజులూరు వచ్చిన మంత్రి గ్రామంలో కార్యకర్తలతో మాట్లాడుతూ చంద్రబాబు, పవన్‌కల్యాణ్ కుట్రలకు త్వరలో ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. ఇద్దరిలో ఏ ఒక్కరూ 175 అసెంబ్లీ స్థానాలలో పూర్తి స్థాయిలో అభ్యర్థులను నిలబెట్టుకునే స్థితిలో లేరని అన్నారు. రానున్న ఎన్నికలలో ప్రతిపక్ష హోదాను సైతం కోల్పోతామనే భయంతో చంద్రబాబు చీకటి ఒప్పందాలకు తెరలేపారన్నారు. చంద్రబాబు పబ్లిసిటీ పిచ్చితో ఆయన సభలలో 11 మంది చనిపోతే ప్రశ్నించటానికే పార్టీ పెట్టిన పవన్‌కల్యాణ్ బాధిత కుటుంబాలను పరామర్శించటానికి కూడా వెళ్లలేదన్నారు. పవన్‌కల్యాణ్ సినిమాలలో మాదిరి రాజకీయాలలోనూ చంద్రబాబు డైరెక్షన్‌లో ప్యాకేజీల కోసం నటిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వనుం వెంకటసుబ్బారావు, ఎంపీపీ మాత భారతి మురళి, వైఎస్సార్ సీపీ మండల బీసీ సెల్ కన్వీనర్ గుబ్బల ఏసురాజు, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ గుత్తుల బుల్లిరాజు, గ్రామ కమిటీ చైర్మన్ మేడిశెట్టి సూర్యప్రకాశ్, శ్రీను, తలాటం వీరన్న, పెద్దిరెడ్డి వెంకన్న పాల్గొన్నారు.

ఏపీఎల్ విజేత అనురాధ వారియర్స్

- ముగిసిన టోర్నీ
- రాష్ట్రస్థాయి క్రీడాకారుల రాకతో హోరాహోరీగా పోటీలు



విజేత అనూరాధా వారియర్స్‌కు ట్రోఫీ అందజేసిన ఎంపీలు బోస్, అనూరాధ, జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు

అమలాపురం రూరల్: అమలాపురం కిమ్స్ క్రీడా మైదానంలో పది రోజులుగా జరుగుతున్న అనురాధ ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) విజేతగా అనురాధ వారియర్స్ జట్టు నిలిచింది. ఆదివారం జరిగిన టీ20 ఫైనల్స్‌లో ప్రత్యర్థి అనంతపురం క్రాంతి ఎలివన్ జట్టుపై గెలిచి ఛాంపియన్‌గా అవతరించింది. తొలుత బ్యాటింగ్ చేసిన క్రాంతి ఎలివన్ జట్టు 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 138 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన అనురాధ వారియర్స్ జట్టు 19.5 ఓవర్లలో 143 పరుగులు చేసి విజేతగా నిలిచింది. కేవలం ఆరు వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఫైనల్స్‌లో ప్రతిభ చూపిన ఉపద్రష్ట విజయ్ 47 బంతులలో 50 పరుగులు చేసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. బెస్ట్ కీపర్‌గా డీవీ విజయ్‌కుమార్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా హరీష్‌కుమార్, బెస్ట్ బౌలర్‌గా సురేంద్ర రెడ్డి ఎంపికయ్యారు. విజేతకు రూ.రెండు లక్షల నగదు, రన్నర్స్‌కు రూ.ఒక లక్ష అందజేశారు.

క్రీడాస్ఫూర్తి ఉండాలి

క్రీడల్లో విజేతలు... పరాజితులు అనేది తాత్కాలికమని, క్రీడా స్ఫూర్తితో ఆడినవారు ఎన్నటికీ విజేతలుగా ఉంటారని రాజ్యసభ సభ్యుడు, ఉమ్మడి గోదావరి జిల్లాల వైఎస్సార్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ పిల్లి సుభాష్ చంద్రబోస్ అన్నారు. ఏపీఎల్ క్రికెట్ టోర్నీ బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఎంపీ అనూరాధ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బోస్ మాట్లాడుతూ కొత్తగా జిల్లాలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు మాట్లాడుతూ క్రీడలు ప్రాంతాల మధ్య సఖ్యతకు వారధిగా నిలుస్తాయన్నారు. ఇంత పెద్ద టోర్నీ నిర్వహించడం ద్వారా ఎంపీ అనూరాధ జిల్లాకు క్రీడల పరంగా గుర్తింపు తెచ్చారన్నారు. ఓఎన్జీసీ ఈడీ ఆదేశ్‌కుమార్ మాట్లాడుతూ క్రీడలతోపాటు అభివృద్ధి కార్యక్రమాలకు తమ సహకారం ఉంటుందన్నారు. ఎంపీ అనూరాధ మాట్లాడుతూ క్రీడల్లో జిల్లాను ముందు వరుసలో ఉంచేందుకు కృషి చేస్తానన్నారు. ఆర్డీవో బి.వసంతరాయుడు, రాష్ట్ర దృశ్య కళల అకాడమీ చైర్‌పర్సన్ కుడుపూడి సత్యశైలజ, మున్సిపల్ చైర్మన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, ఏపీ స్టేట్ అగ్రికల్చర్ మిషన్ సభ్యుడు జిన్నూరి రామారావు, హితకారిణి సమాజం చైర్మన్ కాశి మునికుమారి, వైఎస్సార్ ఉద్యాన యూనివర్శిటీ డైరెక్టర్ జిన్నూరి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీలు పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, గెద్దం సందపరావు, కొనుకు గౌతమి, ఎంపీపీ ఇళ్ల శేషారావు, క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు శివకుమార్ పాల్గొన్నారు.

హిమజీవన సౌందర్యం



కమ్ముకున్న మంచులో 'దమ్ము' చూపుతూ

మంచు తెరలు వీడలేదు.. పుడమిపై పచ్చబొట్లు పెట్టేందుకన్నట్టుగా రైతు కూలీలు నాట్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. చుట్టూ కొబ్బరి చెట్ల మధ్య ఉన్న చేలల్లో పచ్చని తివాచీలా పరుచుకున్న నారుమడి సేకరణతో పాటు... నాట్లు వేస్తూ కూలీలు సందడి చేస్తున్నారు. మరోవైపు దమ్ములు చేస్తున్న ట్రాక్టర్లతో పంట చేలు హడావుడిగా ఉన్నాయి. సంక్రాంతి పండగ సమీపిస్తుండడంతో నాట్లు పూర్తి చేసేందుకు రైతులు హైరానా పడుతుండడంతో డెల్టాలో వరి నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. అమలాపురం మండలం నడిపూడి, జనుపల్లి ప్రాంతాల్లో హిమ సోయగాల్లో శ్రమైక జీవనం ఇలా 'సాక్షి' కంట పడింది.



హస్త'లాగ'వం..

సాక్షి అమలాపురం



మంచు తెరల మాటున.. భూమి పొరల్లోకి నాటుతూ

క్లుప్తంగా

హత్య కేసులో ఎనిమిది మంది అరెస్ట్



బిక్కవోలులో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

బిక్కవోలు: న్యూఇయర్ వేడుకలలో సరదా శృతిమించడంతో జనవరి ఒకటో తేదీన కొమరపు చిన్నాబాబు(19) హత్యకు గురైన కేసులో ఇద్దరు బాల నేరస్తులతో పాటు ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు అనపర్తి సీఐ వి.శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం బిక్కవోలు పోలీస్‌స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 31న కేక్ క్రీమును ఒకరికొకరు పూసేకునే క్రమంలో నూకరాజు, చిన్నబాబు మధ్య ఘర్షణ జరిగిందన్నారు. ఇదే విషయమై చిన్నబాబు భార్య నూకరాజుకు ఫోన్ చేసి అడగగా నీ భర్త రేపు ఉండడంటూ ఆగ్రహం వ్యక్తం చేశాడు. దీంతో ఖండవిల్లి నూకరాజు తన కుమార్తె శిరీషకు జరిగిన విషయాలు చెప్పగా శిరీష, ఆమె భర్త నరకుర్తి సురేష్‌కుమార్ అలియాస్ ధర్మకు ఫోన్ చేసి జరిగిన సంఘటన చెప్పిందన్నారు. నరకుర్తి సురేష్ జనవరి ఒకటి తేదీ తెల్లవారు జామున 3 గంటలకు తన అనుచరులతో కొమరిపాలెం వచ్చి చిన్నబాబును కత్తితో విచక్షణారహితంగా పొడవడంతో చిన్నబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఉదంతంలో ధర్మ, పెదపూడి మండలం రామేశ్వరం చెందిన సత్యాడ వెంకటేష్, పుట్టి అశోక్‌కుమార్, కుంచె వంశీ, కాకినాడకు చెందిన గంపల అశోక్‌కుమార్, కొమరిపాలెం గ్రామానికి చెందిన ఖండవిల్లి నూకరాజుతో పాటు బాల నేరస్తులు ఇద్దరిని ఆదివారం అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరిలో బాల నేరస్తులను రాజమహేంద్రవరం జువైనల్ కోర్టులో, మిగిలిన ఆరుగురి నేరస్తులను అనపర్తి కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలోని ఎస్ఐ పి.బుజ్జిబాబు, బిక్కవోలు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేటు బస్సు ఢీకొని వ్యక్తి మృతి

కిర్లంపూడి: రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఓ ప్రైవేట్ ట్రావెల్ బస్సు బలంగా ఢీకొట్టడంతో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన ఆదివారం క్రిష్ణవరం టోల్‌గేటు వద్ద చోటు చేసుకుంది. కిర్లంపూడి ఎస్ఐ బి.తిరుపతిరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దాపురం మండలం అనూరు గ్రామానికి చెందిన సింగన నాగ నూకచక్రం(57) పశువులకు వట్టిగడ్డి కోసం క్రిష్ణవరం వచ్చాడు. అక్కడ రైతులతో మాట్లాడే ముందు టోల్ గేట్ వద్ద టీ తాగుదామని ఆగాడు. టీ తాగి రోడ్డు దాటుతుండగా రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్ వాల్వో బస్సు బలంగా ఢీ కొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో నూకచక్రం తలకు గాయమై తీవ్ర రక్తస్రావం కావడంతో హైవే పోలీసులు కాకినాడ ట్రస్టు ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కిర్లంపూడి పోలీసులు తెలిపారు. ఈ మేరకు ఎస్ఐ తిరుపతిరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అవసరాలకు అనుగుణంగా ప్రణాళిక

- 2023-24 వార్షిక కార్యాచరణ తయారీలో విద్యాశాఖ
- దీని ఆధారంగానే బడ్జెట్ విడుదలయ్యే అవకాశం
- పాఠశాల నుంచి జిల్లా స్థాయి వరకూ కసరత్తు
- షెడ్యూల్ విడుదల చేసిన ఏపీ సమగ్ర శిక్షా



పాఠశాల

రాయవరం: మనం చేపట్టే పనులు విజయవంతంగా నిర్వహించడానికి ప్రణాళిక అవసరం. ఇది ఎవరికైనా వర్తిస్తుంది. వచ్చే విద్యా సంవత్సరానికి అవసరమైన నిధులు సమకూర్చుకోవడానికి ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేస్తోంది ఏపీ సమగ్ర శిక్షా. ఆవాస ప్రాంతం, పాఠశాల స్థాయిలో అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు తయారు చేసే పనిలో ఉపాధ్యాయులున్నారు. మండల స్థాయి, అనంతరం జిల్లా స్థాయిలో ప్రణాళికలు రూపొందించి రాష్ట్ర స్థాయికి పంపిస్తారు. రాష్ట్ర స్థాయిలో ప్రణాళిక సలహా సంస్థకు ఆమోదం కోసం పంపిస్తారు. ఈ ప్రణాళికల ఆధారంగానే పాఠశాలలకు నిధులు మంజూరు కానున్నాయి. ప్రస్తుతం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో ప్రణాళికలు రూపొందించే పని సాగుతోంది.

సూక్ష్మస్థాయి ప్రణాళిక

విద్యా వ్యవస్థలో పాఠశాల కీలకంగా ఉంటుంది. పాఠశాల స్థాయిలో అవసరాల ఆధారంగా బడ్జెట్‌ను తయారు చేసేందుకు మైక్రోలెవల్ ప్లానింగ్‌ను అమలు చేస్తున్నారు. రాష్ట్ర స్థాయి నుంచి పాఠశాల అవసరాలను గుర్తించకుండా, పాఠశాల స్థాయి నుంచి గుర్తించాలనేది మైక్రో లెవల్ ప్లానింగ్ ముఖ్య ఉద్దేశం. ఇందుకు 2021-22 యూ-డైస్ (యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్)ను ప్రాతిపదికగా తీసుకోవాల్సి ఉంటుంది. యూ-డైస్‌లోని వివరాలను ఆధారంగా చేసుకుని పాఠశాల స్థాయిలో ప్రణాళికలు తయారు చేసుకోవాల్సి ఉంటుంది. పాఠశాల స్థాయిలో గుర్తించిన అవసరాల ఆధారంగా మండల స్థాయి, మండల స్థాయిల్లో గుర్తించిన అంశాల ఆధారంగా జిల్లా స్థాయి ప్రణాళికలను రూపొందిస్తారు. గతంలో ఉమ్మడి జిల్లా ప్రాతిపదికగా ఏడబ్ల్యూపీ అండ్ బీ(యాన్యువల్ వర్క్‌ప్లాన్ అండ్ బడ్జెట్)ను తయారు చేసేవారు. ఇప్పుడు నూతనంగా ఏర్పడిన జిల్లాల వారీగా ప్రణాళికలు సిద్ధం చేయాల్సి ఉంటుంది.

నూతన జాతీయ విద్యా విధానం ప్రకారం

ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్ఈపీ-2020 (నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ) అమలవుతోంది. ప్రస్తుతం అమలవుతున్న జాతీయ విద్యా విధానంలో భాగంగా ప్రీ ప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు ఆరు విభాగాలుగా పాఠశాలలను విభజించారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని దృష్టిలో ఉంచుకుని ఆవాస ప్రాంత ప్రణాళికలు, పాఠశాల అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాల్సి ఉంటుంది. గతంలో 1-8 తరగతులకు, 9-10 తరగతులకు, 11, 12 తరగతులకు వేర్వేరుగా ప్రణాళికలు రూపొందించేవారు. ఇప్పుడా పరిస్థితి ఉండదు. గతంలో ఎస్ఎస్ఏ, ఆర్ఎంఎస్ఏ, పాఠశాల విద్యాశాఖ విభాగాలుగా ఉండగా, వీటన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చి ఏపీ సమగ్ర శిక్షాగా మార్చారు.

షెడ్యూల్ విడుదల

పాఠశాల, హేబిటేషన్, క్లస్టర్, మండల, జిల్లా స్థాయి ప్రణాళికల తయారీకి ఏపీ సమగ్ర శిక్షా షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఇప్పటికే రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో అధికారులు అవగాహనా సమావేశాలు నిర్వహించారు. ఈ నెల 10వ తేదీకి పాఠశాల అభివృద్ధి ప్రణాళిక తయారు చేసి, హేబిటేషన్ పరిధిలో ఉన్న ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి అందజేయాలి. పాఠశాల అభివృద్ధి ప్రణాళికతో పాటు గ్రామంలోని మెయిన్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆవాసప్రాంత ప్రణాళికను రూపొందించాల్సి ఉంటుంది. హేబిటేషన్ పరిధిలో ఉన్న అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు, కళాశాల ప్రిన్సిపాల్స్ హేబిటేషన్ ప్లానింగ్‌లో పాల్గొనాల్సి ఉంది. ఈ నెల 11 నాటికి హేబిటేషన్ ప్లాన్ పూర్తి చేసి, ఒక కాపీని స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంకు అందజేయాల్సి ఉంటుంది. ఆవాసప్రాంత ప్రణాళిక గ్రామసభ ఆమోదం పొందాల్సి ఉంటుంది. పాఠశాల స్థాయిలో ప్రణాళికను ఈ నెల 10వ తేదీకి తయారు చేయాల్సి ఉంది. మండలంలోని అన్ని స్కూల్ కాంప్లెక్స్ పాఠశాలలు అదనంగా కాంప్లెక్స్ పరిధిలోని అన్ని ఆవాసప్రాంత ప్రణాళికలు క్రోడీకరించి క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్లాన్‌ను ఈ నెల 12వ తేదీకి తయారు చేయాల్సి ఉంది. ఈ నెల 16న ఎంఆర్‌సీలో సమావేశం నిర్వహించి క్లస్టర్ డెవలప్‌మెంట్ హేబిటేషన్ ప్లాన్స్‌పై చర్చించాలి. ఈ నెల 18,19 తేదీల్లో స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలు, మండలంలోని లైన్ డిపార్ట్‌మెంట్స్‌తో చర్చించి మండల ప్రణాళిక తయారు చేసుకోవాలి.



పాఠశాల అవసరాలకు అనుగుణంగా

పాఠశాల స్థాయి అవసరాలకు అనుగుణంగా ప్రధానోపాధ్యాయులు ప్రణాళికలు రూపొందించాలి. ప్రణాళిక తయారీలో స్థానికంగా ఉన్న వనరులను దృష్టిలో ఉంచుకుని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకోవాలి. వినూత్నమైన ఆలోచనలకు ప్రణాళిక ప్రాతిపదిక కావాలి.

– ఎస్‌పీ రవిసాగర్, డీఈవో, అమలాపురం



కచ్చితమైన సమాచారంతో..

పాఠశాల, ఆవాసప్రాంత ప్రణాళికల రూపకల్పనలో కచ్చితమైన సమాచారాన్ని పొందుపర్చాలి. ప్రణాళికలో పొందుపర్చే సమాచారం ఆధారంగానే బడ్జెట్ విడుదల ఉంటుంది. ఏపీ సమగ్ర శిక్షా విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం ప్రణాళికలను నిర్దిష్టమైన తేదీల్లో రూపొందించాల్సి ఉంది.

– ఎస్ఏ అబ్రహం, డీఈవో, రాజమహేంద్రవరం

రికార్డు భోగిదండ తయారీ

- ఆరు టన్నుల పేడ వినియోగం
- కిలోమీటరు పొడవు



గుమ్మిలేరులో భోగిదండను ప్రదర్శిస్తున్న మహిళలు

ఆలమూరు: నేటి ఆధునిక కంప్యూటర్ యుగంలో పాశ్చాత్య పోకడలు రోజు రోజుకు పెరుగుతూ అనాదిగా వస్తున్న ఆచార వ్యవహారాలు కనుమరుగై పోతున్న తరుణంలో ఆనాటి తరాన్ని గుర్తు తెచ్చే విధంగా మండలంలోని గుమ్మిలేరులో రికార్డు స్థాయిలో భోగి దండ తయారైంది. ఉరదాలమ్మ-దండు గంగమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహిళా భక్త బృంద సభ్యులు ఆరు టన్నుల ఆవు పేడను సేకరించి దాదాపు 20 రోజుల పాటు శ్రమించి కిలోమీటరు పొడవైన భోగిదండను తయారు చేశారు. భోగిదండను పూర్తిస్థాయిలో అమర్చడం పూర్తికావడంతో నిర్వాహకులు ఆదివారం ఈ అతి పొడవైన దండను ప్రదర్శనగా ఉంచారు. ఈ నెల 14న భోగి పండుగ సందర్భంగా ఈపొడవైన దండకు పూజాది కార్యక్రమాలు నిర్వహించి ఊరేగింపు జరుపుతారు. అనంతరం భోగి మంటల్లో ఈ దండను ఆహుతి చేస్తారు. అయితే ఈ ఏడాది గతంలో తయారు చేసిన 1.5 కిలోమీటరు దండ రికార్డును మాత్రం బ్రేక్ చేయలేకపోయారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి





మృతులు సతీష్, హరిష్



భార్య, కుమారుడితో సతీష్ (ఫైల్)

సామర్లకోట: స్థానిక కాకినాడ కెనాల్ రోడ్డులో ఆదివారం తెల్లవారు జామున జరిగిన ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. ఇంద్రపాలెం పోలీసుల కథనం ప్రకారం ఉదయం కారులో సామర్లకోట నుంచి ఇద్దరు వ్యక్తులు కాకినాడ వెళుతూ ఉండగా మాధవపట్నం చైతన్య ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో రోడ్డు మార్జిన్‌లో ఉన్న చెట్టును కారు ఢీ కొంది. దాంతో కారు నుజ్జు నుజ్జు అయింది. కాకినాడ పాత బస్‌స్టాండ్ పేర్రాజుపేటకు చెందిన పంతాడి సతీష్ (24) కారు నడుపుతూ ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవరు సమీపంలో ఉన్న వ్యక్తి హరిష్ (26) తీవ్రంగా గాయపడటంతో కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో చనిపోయాడు. ఇంద్రపాలెం ఎస్ఐ ఎం.నాగరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బయటకు వెళ్లి తిరిగి రాలేదు

కాకినాడ క్రైం: సతీష్ కాకినాడ వార్ఫ్‌రోడ్డులో నివాసం ఉంటున్నాడు. పెయింటర్‌గా జీవనాన్ని కొనసాగిస్తున్నాడు. మూడేళ్ల క్రితం వివాహం కాగా ఏడాదిన్నర బాబు ఉన్నాడు. భార్య జ్యోతి తొమ్మిదవ నెల గర్భిణి. ఆమె పుట్టింటికి వెళ్లింది. సతీష్ శనివారం రాత్రి ఇంటికి వచ్చి తల్లిని రూ.50 కావాలని అడిగి తీసుకున్నాడు. ఈ రాత్రి తన స్నేహితుడి గదిలో పడుకుంటానని తల్లి దుర్గతో చెప్పి వెళ్లాడు. అలా వెళ్లిన సతీష్ తిరిగి ఫోన్ కూడా చేయలేదు. తెల్లవారు ఝామున దుర్గ ఫోన్‌కు ఓ కాల్ రాగా తాము పోలీసులమని సతీష్ అనే వ్యక్తి, మరో వ్యక్తితో రోడ్డు ప్రమాదానికి గురయ్యారని చెప్పారు. దీంతో దుర్గ ఇంటి పెద్దలతో కలిసి పోలీసులు చెప్పినట్లు కాకినాడ జీజీహెచ్‌కు వచ్చింది. అయితే అప్పటికే తన కుమారుడు సతీష్ మృతి చెంది ఉండటాన్ని చూసి గుండెలవిసేలా రోదించింది. సతీష్‌కు తమ్ముడు శ్రీను, చెల్లెలు స్వర్ణ ఉన్నారు. నిండు గర్భిణిగా ఉన్న భార్య ఆరోగ్యాన్ని చూసుకుంటూ సతీష్ మరో వైపు సోదరి స్వర్ణకు పెళ్లి చేసేందుకు సంబంధాలు వెదికే పనిలో ఉన్నాడు. ఈ లోపే ఘోరం జరిగి సతీష్ దూరమవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. మృతి చెందిన మరో యువకుడి పేరు హరీష్ అని, లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడనీ స్వస్థలం నిడదవోలని చెబుతున్నా పోలీసులు నిర్ధారించలేదు. దీంతో పోస్టుమార్టం ప్రక్రియలో సందిగ్ధత నెలకొంది.

ప్రభుత్వం అండగా ఉంటుంది

- మంత్రి వేణు

రామచంద్రపురం: కష్టాలలో ఉన్నవారిని మానవతా దృక్పథంతో ఆదుకునే మంచి మనసున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, ప్రజలకు ఎప్పుడూ అండగా ఉండే ప్రభుత్వం ఇది అని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌరసంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. కాకినాడలో డిగ్రీ చదువుతూ ప్రేమోన్మాది చేతిలో పెదపూడి మండలం కాండ్రేగుల వద్ద హత్యకు గురైన కాదా శ్రీదేవి తల్లిదండ్రులు కాదారాంబాబు, నాగమణి దంపతులకు ప్రభుత్వం తరఫున రూ.10లక్షల చెక్కును మంత్రి వేణు రామచంద్రపురం ఆయన క్యాంపు కార్యాలయం వద్ద ఆదివారం అందజేశారు. మంత్రి వేణు మాట్లాడుతూ ఒక ప్రేమోన్మాది చేతిలో శ్రీదేవి మృతి చెందడం దురదృష్టకరమని, వారి కుటుంబానికి ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. వైఎస్సార్ సీపీ నేతలు పంపన సుబ్బారావు, కోటి వెంకట్రావు పాల్గొన్నారు.



మృతురాలు శ్రీదేవి తల్లిదండ్రులకు చెక్కు అందజేసిన మంత్రి వేణు

మానవతామూర్తి నరసింహారావు

- మిత్రులు, శ్రేయోభిలాషుల ఆధ్వర్యంలో సన్మానం

గండేపల్లి: నిత్య కృషీవలుడు, మానవతామూర్తి అని శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల అధినేత చిట్టూరి వెంకట కృష్ణ నరసింహారావునుద్దేశించి వక్తలు కొనియాడారు. మండలంలోని గండేపల్లిలో కంటిపూడి నరేంద్రబాబు కృషివనంలో ఆదివారం నరసింహారావు, రామ సీత దంపతులకు సన్మానం నిర్వహించారు. ముఖ్య అతిథిగా నాబార్డ్ చైర్మన్ పమిడి కోటయ్య (రిటైర్డ్), అతిథులుగా ముల్కనూర్ కో ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు అలిగిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, దాన పండిట్, అత్యుత్తమ వరి రైతు నెక్కంటి సుబ్బారావు, సీబీఆర్ అకాడమీ స్పోర్ట్స్ ఎడ్యుకేషన్ చైర్మన్ చలసాని బాబు రాజేంద్ర ప్రసాద్, నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్(రిటైర్డ్) పాలాది మోహనయ్య, ఐఎస్ఏపీ పవర్ సీఈఓ వ్యవస్థాపక డైరెక్టర్ మల్లెల వెంకటరావు, రిటైర్డ్ ప్రిన్సిపాల్ సెక్రటరీ మన్మోహన్‌సింగ్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ స్కూల్ అంటే సమాజాన్ని నిర్మించే అద్భుత ప్రయోగశాల అనే నినాదంతో 1977లో శ్రీ ప్రకాష్ విద్యాసంస్థలను ప్రారంభించినట్టు తెలియజేశారు. వరంగల్ నుంచి ఇంజినీరింగ్ పట్టా తీసుకుని కాంట్రాక్టర్‌గా అనేక నిర్మాణాలు విజయవంతంగా పూర్తిచేసినట్టు తెలిపారు. 2014లో జాతీయ ఉత్తమ పాడి రైతు అవార్డు సాధించడమే కాకుండా పశువ్యర్థాల నుంచి రాష్ట్రంలోనే అతిపెద్ద బయోగ్యాస్ ప్లాంట్‌ను స్థాపించి నిర్వహిస్తూ తమ విద్యాసంస్థలకు కావలసిన గ్యాస్, విద్యుత్‌ను తయారు చేయడమే కాకుండా గ్యాస్ ద్వారా వాహనాలు నడిచే దిశగా ప్రయోగాలు చేస్తున్నట్టు వివరించారు. కేరళ ఆయుర్వేద చికిత్సను పాయకరావుపేటలో శ్రీ ప్రకాష్ ఆయుర్వేద చికిత్సాలయం పేరుతో ఏర్పాటు చేసి తక్కువ ఖర్చుతో రోగులకు అనుకూలంగా మెరుగైన ప్రమాణాలతో వైద్యసేవలందిస్తున్నట్టు పేర్కొన్నారు. తన స్నేహితుల జ్ఞాపకార్థం తాగునీటి సౌకర్యంలేని గ్రామాలలో ఆర్‌ఓ ప్లాంట్లు ఏర్పాటు చేయడంతో పాటు దేవాలయాలు నిర్మించారని కొనియాడారు. 80 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఆయన జీవన చిత్రం వేయి పున్నములు-కోటి దీపాలు పుస్తక ఆవిష్కరణ చేశారు. నరసింహారావు చిననాటి స్నేహితులు పాల్గొన్నారు.



శ్రీ ప్రకాష్ అధినేత దంపతులను సన్మానిస్తున్న ఆయన చిన్ననాటి స్నేహితులు

సాక్షి క్లాసిఫైడ్స్


Real Estate

PLOT FOR SALE

■ ముల్లెటివారి మెరక, నియర్ తాటిపాక మెయిన్ రోడ్డుపై 10సెంట్లు భూమి క్లియర్‌టైటిల్‌తో అమ్మకానికి కలదు. Ph: 9704654884, 9985171456 [H-748350]

Services

BUSINESS OFFER



■ పెట్టుబడి మీరే పెట్టుకొని ఇంట్లో ఉంటూ కొవ్వొత్తులు, ఫ్లోర్ తుడిచే మాప్స్, పెన్సిల్స్, పేపర్ ప్లేట్స్ తయారు చేసి మాకు ఇవ్వండి వీక్లీ పేమెంట్. ఫోన్ : 9491996566. [H-779936]

GOLD FINANCE




■ బంగారం బ్యాంకులలో, ఇతర సంస్థలలో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. స్పాట్ క్యాష్ ✆ 99 12 72 1888 [B-1197721]

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్. ✆ 76508 91999 [B-786657]

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 90009 92521 [B-2285]


HEALTH CARE



ఆయుర్వేదం

■ బొల్లి, తెల్లమచ్చలు, సోరియాసిస్‌లకు ఎటువంటి పత్యం లేని చికిత్స కలదు. మందులు ఉచితముగా ఇవ్వబడును. సంప్రః 9603055647, 7995392747 [G-888]

MARRIAGE BUREAU



■ హిందువులలో అన్ని కులముల వారికి మొదటి మరియు ద్వితీయ వివాహములు చూడబడును. స్వయంగా మేమే వచ్చి వధువు లేదా వరుడు యొక్క వివరములు తీసుకుంటాము. ముందుగా ఎటువంటి ఫీజు అవసరం లేదు. (షరతులు వర్తిస్తాయి). ఫోన్ : 89776 36485 [V- 10036]

Wanted

■ హరేకృష్ణ హోంకేర్ విజయవాడలో వృద్ధులను / పేషెంట్స్‌ని చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు (M/F) కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం16,000/- ✆ 96405 28899, 96406 48899 [B-768]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 95736 33520, 90596 33520 [M-1203199]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-776004]

■ ఇంటర్‌నేషనల్ ఏయిర్‌పోర్ట్‌లలో కార్గో సూపర్‌వైజర్స్ హౌస్ కీపింగ్ సూపర్‌వైజర్స్, సెక్యూరిటీ సూపర్‌వైజర్స్ లోడర్స్, సెక్యూరిటీ గార్డ్స్, కావలెను, జీతం: 21K to 30K, రూం+మీల్స్ ఫ్రీ. Q: 5th to డిగ్రీ. 8886186894. [H-778953]

■ కావేరి సీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నందు మీఇంటి వద్దనే ఉండి పార్ట్/ఫుల్ టైమ్ వర్క్ చేయుటకు యువతి, యువకులు కావలెను. జీతం: 13-18 వేలు, Ph: 8276971388, 8276055797 [HA-851]

■ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ లో పనిచేయుటకు అర్జెంటుగా సూపర్ వైజర్స్, లోడర్స్, హౌస్ కీపింగ్, గార్డ్స్ కావలెను. జీతం: 19500 -25500-, ఫ్రీ రూమ్ + మీల్స్, స్త్రీ/పురుషులు కావలెను. 8గం. డ్యూటీ. ఫోన్ : 8142659495. [H-778956]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
సాక్షి క్లాసిఫైడ్స్
నాలుగు లైన్లకు రూ. : 400/-
అదనపు లైనుకు రూ. : 90/-
GST 5% Extra
సర్వే నెం.264, ADB రోడ్, రాజానగరం.
ఫోన్: 0883-2483010

గమనిక

PACKERS & MOVERS

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మెడికల్ అసోసియేషన్ ఫార్మేషన్ కమిటీ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కన్వీనర్ వెంకటరాజు

తాళ్లపూడి: మారుతున్న కాలానికి అనుగుణంగా కెమిస్టులు తమ వ్యాపారాలను మార్చుకోవడంతో పాటు వినియోగదారుల అవసరాలు తీర్చడానికి చిత్తశుద్ధితో మెలగాలని తూర్పుగోదావరి జిల్లా మెడికల్ అసోసియేషన్ కన్వీనర్ బలభద్ర వెంకటరాజు అన్నారు. తూర్పుగోదావరి జిల్లా మెడికల్ అసోసియేషన్ నూతన కమిటీ ఏర్పాటుకు (ఫార్మేషన్ కమిటీ) ఆదివారం మండలంలోని గజ్జరంలోని పిండి గణపతి ఫాం హౌస్‌లో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. తాళ్లపూడి, గోపాలపురం, నల్లజర్ల మండల శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లాలోని 23 మండలాల నుంచి మండల శాఖల కార్యవర్గ సభ్యులతో పాటు పలువురు కెమిస్టులు కుటుంబ సభ్యులతో హాజరయ్యారు. జిల్లా నాయకుల సమక్షంలో అజెండా, బైలా ఎలా ఉండాలి తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో జిల్లా కన్వీనర్ వెంకటరాజు మాట్లాడుతూ కొత్త జిల్లాలను ఏర్పాటు చేసినందున జిల్లా కొత్త కమిటీల ఏర్పాటును ఈ నెలాఖరుకు పూర్తి చేస్తామన్నారు. దీనికి ముందుగా అన్ని మండలాల కమిటీలను రెండు, మూడు రోజుల్లో ఏర్పాటు చేయాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే రాష్ట్ర కమిటీ దృష్టికి తీసుకు వెళతామన్నారు. సంఘ సభ్యులందరూ ఐక్యంగా పనిచేయాలని సూచించారు. జిల్లా మెడికల్ అసోసియేషన్ కో-కన్వీనర్ రాయపూడి శ్రీనివాసరావు, తాళ్లపూడి మండల మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు పిండి గణపతి, సెక్రటరీ కె.బాబురావు, కోశాధికారి జి.రాజగిరిధర్, గోపాలపురం, నల్లజర్ల మండల శాఖల అధ్యక్షులు ఎస్.సాయిప్రసాద్, ఎస్.బాపిరాజు, సభ్యులు ఎండీ ఫరూఖ్, బి.గుప్త, డాక్టర్ మంగన్న, డాక్టర్ భానుప్రసాద్, డాక్టర్ వైఎస్ మూర్తి పాల్గొన్నారు.

విద్యార్థులు సృజన పెంచుకోవాలి

- తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న తిరుమలరావు

రాజమహేంద్రవరం రూరల్: విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకోవాలని, భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా మారి దేశానికి సేవచేయాలని తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు సూచించారు. ఆదివారం రాజమహేంద్రవరంలోని తిరుమల విద్యాసంస్థల ఆవరణలో భారతీయ విజ్ఞాన మండలి, ఎస్‌సీఆర్‌ఈటీ, విజ్ఞాన్‌ప్రసార్ సంయుక్తంగా విద్యార్థి విజ్ఞాన్‌మంథన్ జాతీయ స్థాయి ప్రతిభా అన్వేషణ పోటీల రాష్ట్రస్థాయి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా నున్న తిరుమలరావు, ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ సైన్సెస్ ప్రొఫెసర్ వై.శ్రీనివాసరావు, విజ్ఞాభారతి కౌన్సిల్ మెంబర్ కేవీ సుబ్బరామశాస్త్రి, అభ్యుదయకవి అష్టావధాని తాతాసందీప్‌శర్మ పాల్గొన్నారు. ముఖ్యఅతిథులు మాట్లాడుతూ విద్యార్థులు చరిత్ర గురించి అవగాహన కలిగి, భారతదేశ సంస్కృతీ సంప్రదాయాలను అందరికీ తెలియజేయాలని కోరారు. తిరుమల విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ వి.శ్రీహరి పాల్గొన్నారు.

అందాల పోటీల్లో గుమ్మిలేరు ఆవుకు ద్వితీయ స్థానం



అందాల పశువుల పోటీల్లో అవార్డును అందుకుంటున్న రైతు సత్తిబాబు



అందాల పోటీ అవార్డు సాధించిన పుంగనూరు ఆవు


ఆలమూరు/తాడేపల్లిగూడెంరూరల్: ఏలూరు జిల్లా తాడేపల్లిగూడెంలో ఆదివారం జరిగిన జాతీయ స్థాయి పశువుల అందాల పోటీల్లో గుమ్మిలేరుకు ద్వితీయ స్థానం లభించింది. పుంగనూరు ఆవుల పెంపకంలో రాష్ట్ర స్థాయి గుర్తింపు పొందిన ప్రముఖ పశుపోషకుడు రెడ్డి సత్తిబాబుకు చెందిన పుంగనూరు గిత్త ఈ ఘనత సాధించింది. దీంతో ఆయన రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు, ఎమ్మెల్సీ కె.మోషేష్‌రాజు చేతుల మీదుగా మెమోంటోను, రూ 20 వేలు చెక్కును అందుకున్నారు. ఈ అవార్డు ఇచ్చిన ప్రోత్సాహంతో పశు పోషణకు మరింతగా కృషి చేస్తానని సత్తిబాబు అన్నారు. తన స్వగ్రామమైన గుమ్మిలేరులో సర్పంచ్ గుణ్ణం రాంబాబు ఆధ్వర్యంలో రైతులు ఆయనకు ఘన స్వాగతం పలికారు.

పోటీల విజేతలు

- ఒంగోలు జాతి ఆవుల విభాగంలో.. వేగుళ్ల మురళీ (మండపేట), రిమ్మలపూడి గుణశేఖర్ (రాజోలు), మల్లిపూడి వెంకట్రావు (నేలటూరు)కు చెందిన పాడి పశువులు వరుసగా మొదటి స్థానాల్లో నిలిచాయి.
- దేశీయ ఆవుల (అన్నిరకాలు) విభాగంలో.. ఎస్‌వీవీఎస్ శరణ్ (మండపేట), మల్లిపూడి వెంకట్రావు (నేలటూరు), బి.మణికంఠ సతీష్ (భీమవరం)కు చెందిన పాడి పశువులు విజేతలుగా నిలిచాయి.

అట్టహాసంగా ఆత్మీయ సమ్మేళనం

- స్కిట్‌తో అలరించిన బుల్లితెర నటులు
- సుదీర్ఘకాలం సేవలందించిన సిబ్బందికి సత్కారం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న అతిథులు

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య క్యాంపస్‌లో ఆదివారం రాత్రి ఆత్మీయ సమ్మేళనం అట్టహాసంగా జరిగింది. కనులు మిరుమిట్లు గొలిపే విద్యుత్ కాంతులతో మిలాన్ పేరిట నిర్వహించిన గెట్ టు గెదర్ కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. కాకినాడ జేఎన్‌టీయూకే వైస్ చాన్సలర్ ప్రసాదరాజు, ప్రొఫెసర్ సీహెచ్ మురళీకృష్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. 15 ఏళ్లకు పైబడి ఆదిత్య విద్యాసంస్థల్లో సేవలందిస్తున్న సిబ్బందిని ఘనంగా సన్మానించారు. 23 ఏళ్లుగా నడుస్తున్న కళాశాలకు సంబంధించి ఫొటో ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బుల్లితెర నటులు హైపర్ ఆది, గెటప్ శ్రీను, ఆటో రాంప్రసాద్, దొరబాబు ప్రదర్శించిన స్కిట్లు ఆహుతులను అలరించాయి. విద్యాసంస్థల వైస్ చైర్మన్ ఎస్.సతీష్‌రెడ్డి, శృతి దంపతుల ద్వితీయ కుమార్తె భవ్యసహజారెడ్డి చేసిన నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆదిత్య విద్యాసంస్థలు రాష్ట్రస్థాయిలో గుర్తింపు సాధించడానికి కృషి చేసిన సిబ్బందికి విద్యాసంస్థల అధినేత ఎస్.శేషారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆదిత్య యాజమాన్య ప్రతినిధులు ఎస్.సతీష్‌రెడ్డి, శృతి రెడ్డి, సుగుణా రెడ్డి, లక్ష్మీరాజ్యం, ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరెడ్డి, ఎ.రమేష్, డోలా సంజయ్, కె.రవిశంకర్, డి.సతీష్ కుమార్, ఎస్‌టీఎస్‌వీ కుమార్ పాల్గొన్నారు.



నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారి భవ్యసహజారెడ్డి